


# డబ్బు

తారక రామారావు

సుబ్బరాజుకూ గున్న ఏనుగుకూ తేడా లేదు—తొండం తప్ప.

సుబ్బరాజుకు ఆకలెక్కువ. ఆలోచనా ఎక్కువే.

సుబ్బరాజు గవర్నమెంట్‌లో ఉద్యోగి.

ఉద్యోగి అంటే, నిత్యం ఆదాయమే తప్ప, ఖర్చెరుగని

లాభదాయకమైన ఉద్యోగి.

ఉద్యోగంలో చేరినప్పట్నుంచి, డబ్బు ఎలా గుంజాలో-ఆ మెలకువలన్నీ గ్రహించాడు. ఆ పైన సాధన చేశాడు చేసి డబ్బు సంపాయించడమే ధ్యేయంగా, అందుకే బ్రతుకుతున్నట్లుగా వుండేవాడు.

భగవంతుడు దయామయుడు.

సుబ్బరాజుకు ఆరుగురు పిల్లలు. అందరూ లంగాల వాళ్ళే.

అయినా సుబ్బరాజు అధైర్య పడలేదు.

ఆదాయం ఇంకా ఇంకా పెంచుకున్నాడు. అయినవాళ్ళ దగ్గర, కాని వాళ్ళదగ్గర ఓ రికార్డ్ పెట్టేవాడు.

"ఏం ఉద్యోగం బాబు మాది. పని చెయ్యమంటే క్రింద వాళ్ళ గోల. ఇంకా పని చెయ్యండి, సామర్థ్యం పెంచండీ అని పై వాళ్ళ హుంకులు. అబ్బే! ఆఫీసర్ల బ్రతుకు దోలు లాంటిది. రెండు వేపులా వాయించే. ఇంతా చేసి మిగిలేది చివాట్లు, బర్తరఫ్‌లూ! అంతే! నా బ్రతుకు మరీ అధ్వాన్నం బాబూ! ఆరుగురు సంతానం. పురుళ్ళు, పుణ్యాలు, పుణ్యవచనాలు, తద్దినాలు, రిబ్బన్లు, పౌడర్లు, లంగాలు, ఓణీలు, చీరెలు, సారెలు, గాజులు, పూలు—అయ్యబాబోయ్! మీకు తెలియనిదేముంది? ఏదో మీలాంటి వాళ్ళు అడపా దడపా ఇచ్చే మామూళ్ళే గతి. ఇవ్వలేక పోతే, మేం పస్తులుండాల్సిందే!"

పైలో స్తే లాభం లేదు.

రూల్స్.... ఒప్పుకోడు.

ఏదో పేచీ, మరత పేచీ వేస్తాడు.

ఫైలు పెరుగుతుందే తప్ప పని గాదు.

మనిషి రావాలి.

లాభమెంతో అంచనా ఇవ్వాలి.

సుబ్బరాజు పెట్టే, దోలు రికార్డు వినాలి.

ముడుపు చెల్లించాలి.

పైలు సంతకమవుతుంది.

"మీకు ఓ పావలా లాభమొస్తే ఓ పైసా నా మొహాన పారెయ్యటానికి ఏడుపెందుకు—ఏదో మీ సొమ్మంతా దోచిపెడుతున్నట్లు?" అని ఉపన్యాసమూ, ధర్మ సూక్ష్మమూ చెప్పేవాడు సుబ్బరాజు.

అయిందా?

ఇదంతా నిత్యకార్య క్రమం.

ఇహ సీజనల్ కార్యక్రమాలు కొన్ని వున్నాయి. ఎండాకాలంలో-

"అబ్బబ్బ! ఏమి ఎండలండీ బాబూ! పెనంమీద కూర్చున్నట్లుందంటే నమ్మండి! పైగా ఈ వెధవ కరెంటొకటి—వుండదు! అవును సరే! పచ్చడి మామిడికాయలు

ఇంత గిరాకేమండీ! వంద నల భై టు! లాభం లేదండీ! ఈ ఏడు ఆవకాయ తినే యోగం లేదు. పైగా చూశారూ—మూలిగే నక్క మీద తాటికాయపడ్డట్లు మా పెద్ద మ్మాయి ఇంత ఉత్తరం వ్రాసింది. 'నాన్నా నాకు నెలతప్పింది. ఒకటే వేవిళ్ళు! అస్సలు పనిచేసుకోకుండా ఉన్నాను. ఓ వందకాయ ఆవవేసి పంపండీ' అని!"

మిరపకాయలు, ఆవనూనె, శనగలు—అన్నీ వచ్చిన పార్టీల నుంచీ కొసరుగా తెప్పించుకునే వాడు.

"బాబూ! మొహమాట పడ కండి. మీరెంత ఖర్చు చేశారో చెప్పండి-ఇచ్చుకుంటాను. మీరేదో ఊరికే ఇచ్చినట్లు, నేను ఆవ కాయికీ- మిరపకాయలకూ కక్కుర్తి పడినట్లు దేనికి? ఏమం టారు?" అని కూడా అనేవాడు.

అయితే సుబ్బరాజు ఏనాడు ఓ రూపాయి ఇవ్వనూలేదు. తెచ్చిన వాళ్ళు అడగనూ లేదు.

అలాగని సుబ్బరాజు స్వార్థ పరుడనుకోవద్దు. పెళ్ళయిన కూతు ళ్ళందరికీ కావలసిన దినవెచ్చాలు సంపాయించి పంపేవాడు. పాపం కూతుళ్ళు కూడా—

"మా నాన్నకు అన్నీ సప్లయి కొస్తాయండీ! మరీ బలవంతం చేసి ఇచ్చిపోతారు. మా నాన్న మరీ మొహమాటస్థుడండి. ఇచ్చే వాళ్ళ పోరు పడలేకనే పుచ్చుకుంటాడు" అని తండ్రి కీర్తిని పొగడు తుంటారు.

పాలడబ్బాలు, పౌడర్ డబ్బాలు, జాకెట్లు, దుప్పట్లు, డోర్ కర్టెన్లు, కారాలు, అప్పడాలు, వడియాలు, కరివేపాకు, నూనెలు, నేతులు, సువాసనల తల నూనెలు—ఇలా సమస్తం తండ్రికి వ్రాసి తెప్పించు కుంటారు.

ఇకపోతే, సుబ్బరాజు క్యాంప్‌కి వెడితే, క్షురకర్మ, అభ్యంగన స్నానం, గుళ్ళోపూజ చికెన్, మటన్, బ్రాందీబుడ్డీ కాక ప్రక్కన ప్రక్కలో మనిషి లేనిదే నిద్ర పోడు.

ఇది సుబ్బరాజు చరిత్ర.

ఐదుగురు ఆడపిల్లలకు పెళ్ళిళ్లు చేసి పంపేశాడు. ఆరో పిల్ల కనకం పెళ్ళి చెయ్యాలి.

కనకం పెళ్ళి సమస్య అయింది సుబ్బరాజుకు. ఎందుకయిందంటే—

కనకానికి చదువబ్బలేదు—గారా బంతప్పు. సుబ్బరాజు తెలివీ రాలేదు- పోలికతప్పు. వచ్చిన సిని మాలు చూసి రాబోయే సినిమాలకై ఎదురుచూస్తుంటుంది.

వంటరాదు. అల్లికలు, కుట్లు, ముగ్గులు అస్సలు తెలియవు. పెళ్ళి ఎలా అవుతుంది?

కట్నం ఇవ్వగలడు సుబ్బరాజు.

కానీ, ఆలి మర్కటంగా భరించే మొగాడు దొరకలేదు. సుబ్బరాజు, మొలతాడున్న మగాడి కోసం వెతికేందుకే అఘోరిస్తుంటే కనకం-

"నాన్నా! అడ్డమైన వెధవల్నీ తీసుకొస్తే పెళ్ళిచూపులకు నేనొప్పుకోను. తెలిసిందా? ముందే చెపుతున్నా- యన్.టి.ఆర్ పర్సనాలిటీ. శోభన్ ముఖం, నాగేశ్వరరావులా చలాకీ, కృష్ణలా డాషింగ్‌గా ధర్మేంద్రలా లౌలీగా వుండాలి- నాక్కాబోయే భర్త. వీడికి ఆస్తి వుంది, వాడికి ఉద్యోగం వుంది, అదిగో___అతనికి మంచి గుణాలున్నాయి అంటే నే ఒప్పుకోను" అని హెచ్చరించింది.

సుబ్బరాజుకు కనకమంటే ప్రేమ ఎక్కువ.

సుబ్బరాజు తల్లి పేరు కనకం.

సుబ్బరాజు కొలిచేది కనకాన్నే.

అయినా కనకం పెళ్ళి సమస్య అయింది సుబ్బరాజుకు. సుబ్బరాజు భార్య యశోద ఆదర్శ సతీమణి. కాపరాని కొచ్చిందగ్గర్నుంచి వార్షికంగా పిల్లల్ని కనడం, తీరుబడి వున్నప్పుడు పూజలు, వ్రతాలు, నోములు నోయటం ఇంకా తీరికుంటే కనపడ్డ రాయికి, గుళ్ళో వున్న దేవుళ్ళకు గడ్డాలు పెంచుకున్న సాధువులకు మొక్కటం_యింతే ఆమెపని.

కనుక సుబ్బరాజు ఏకాకి.

పురోహితులకు డబ్బు ఆశ చూపించాడు.

మధ్యవర్తులకు, పెళ్ళిళ్ళ పేరయ్యలకు రాయబారాలు పంపాడు.

మానవ ప్రయత్నం చేశాడు.

దేవుడు అనుకూలించాడు.

కనకం కలలు ఫలించాయి.

సుబ్బరాజు కష్టాలు తీరాయి.

కనకాన్ని చూచేందుకు, చూచి, కనకం రూప లావణ్య వయో విశేషాలతో సంబంధం లేకుండా కనకానికి భర్త అయ్యేందుకు కాంతారావు బి.ఎ. ఒప్పుకున్నాడు.

అందుకు రెండే రెండు షరతులు_ కట్నం యాభై వేలు.

కాంతారావు బి.ఎ.కు ఉద్యోగం ఇప్పించాలి.

సుబ్బరాజు ఎగిరి ఏనుగెక్కినంత సంబర పడ్డాడు___డబుల్ ప్రమోషన్ ఇచ్చినట్లు.

లక్ష రూపాయల లంచం ముట్టినట్లు.

పదేళ్ళ తరవాత భార్య మళ్ళీ

సీళ్ళోసుకుని, ఆ తర్వాత జంట కవల మొగపిల్లల్ని కన్నట్లు సంతో షించాడు.

పెళ్ళిచూపులు జరిగాయి.

కాంతం మొహమంతా కళ్ళు చేసుకుని కాబోయే మొగుడును ఎక్స్‌రే కళ్ళతో చూసింది.

సభ్యత అడ్డం వచ్చిందిగాని లేకపోతే అప్పుడే మీదపడి ముద్దు పెట్టుకునేది, కౌగిలిలో బంధించేది.

సుబ్బరాజు ఒప్పుకున్నాడు.

కాంతారావు సరేసరి!

కనకం "నాన్నా, అతను నా కోసం, నేను అతని కోసం పుట్టాం" అనలేక-

"'జన్మ జన్మల బంధం' మాది. అతడు 'మగాడు'- నేను 'స్త్రీ' 'మేం 'భార్యాభర్తలు' 'ఆలుమగలు.' మావి 'మూగమనసులు', 'లేతమనసులు' 'నిండు మనసులు.' ఆయన 'మహాత్ముడు' 'బుద్ధిమంతుడు' 'నిప్పులాంటి మనిషి.' నేను 'ఊర్వశి' 'సుజాత' 'సంధ్య' 'ప్రియ బాంధవి' ని" అని సినిమా పరి భాషలో అంగీకారం తెలిపింది.

సఖులతో, చెలికత్తెలతో సిని మాలకెళ్ళింది.

ఈస్టమన్ కలర్‌లో—ఊటీ, కొడైకెనాలో, డాల్ సరస్సులలో కనకం విహరించింది కలలో.

సుబ్బరాజు ఆఫీసులో క్రింది ఉద్యోగులను భయపెట్టి తనే స్వయంగా లంచాల సేకరణ చెయ్య సాగాడు.

కాంతారావు బి.ఏ. కి తన డిపార్టుమెంట్‌లోనే ఉద్యోగం వేయించాడు. డబ్బు రెడీ చేశాడు.

ఇంటికి వెల్ల వేయించాడు.

సామానులు, సరుకులు తెప్పించాడు. సొమ్ములు చేయించాడు, సమకూర్చుకున్నాడు.

ఎప్పుడు పెళ్ళి?

రేపు లగ్నాలు పెట్టుకోవాలను కున్నారు.

కాంతారావు బి.ఏ. నాయనమ్మ హరీ అంది.

సూతకం! పదహారు రోజులు గడిచాయి.

ఆ తర్వాత మూఢమొచ్చింది.

మూఢమి వెడుతుండగా, పుష్కరాలొచ్చాయి.

పుష్కరాలు అవుతుండగానే, కాంతారావు బి.ఏ. ఉద్యోగం ఖాయ మయింది.

పెళ్ళికి ముహూర్తం పెట్టారు. అటు పెద్దలు, ఇటు పెద్దలు తీరిగ్గా కూర్చుని, తాంబూలాలు పుచ్చుకు నేందుకు సిద్ధమవుతుండగా, కాంతారావు, ఎదుట పేర్చిన యాభై వేలను చూసి—

"సుబ్బరాజూ! మనకింకా బంధుత్వం కలవలేదు. కనుక మీరు సుబ్బరాజే నాకు! మావయ్య అని పిలవను. నాకు యాభై వేలు కట్నం ఇచ్చేందుకు అంగీకరించి డబ్బు సమకూర్చారు. బాగుంది. అయితే, ఈ యాభై వేలు, మీరు స్వయంగా కష్టపడి సంపాయించినవే అయివుండాలి. అలా అయితేనే అంగీకరిస్తాను" అన్నాడు.

సుబ్బరాజు అవును, కాదు అనబోతుండగా కాంతారావే మాట్లాడాడు-

"నాకు నమ్మకం లేదు- మీరింత డబ్బు మీ జీతంలోనే కూడబెట్టి మిగిల్చారని! ఎందరి నోళ్ళుగొట్టి, జలగలా పీడించి ఈ డబ్బు సంపాయించారో చెప్పండి! ఎంతో మందిని హింసించినడబ్బు నాకొద్దు. అచ్చిరాదు. నా పిల్లలు కుంటివాళ్ళో కుష్టువాళ్ళో అవుతారు. లేదా పిచ్చివాళ్ళు, మదపిచ్చివాళ్ళూ కూడా కావచ్చు! మీరు చేసిన పాపాలు, అన్యాయాలు, అక్రమాలకు ప్రతిఫలంగా వచ్చే ఈ డబ్బును నే ముట్టుకోను!"

సుబ్బరాజుకు నోట మాట లేదు.

అప్పుడే ఎవరో చచ్చినట్లు. అంతా నిశ్శబ్దంగా వున్నారు.

కొన్ని ఘడియల తర్వాత ఓ పెద్దమనిషి గొంతు పెగల్చుకుని. "తాంబూలాలదాకా వచ్చాక.." అని


విజయ
మాస పత్రికలో
సంచలనం సృష్టించిన
శ్రీప్రసాద్
చారిత్రాత్మక నవలలు
ఆర్యచాణక్య ..10.00
రోషనార ..8.00
అప్జాల్ ..10.00
యుగంధర్ ..12.00
ఇప్పటికే
వేయి కాపీలు పైగా
అమ్ముడై
మీ అభిమానాన్ని
చూరగొన్న పుస్తకాలు.
నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ-2

అనబోయాడు.

కాంతారావు- "నేపెట్టిన షరతులు ఈ పెళ్ళికి రెండే! ఒకటి- ఉద్యోగం, వచ్చేసింది. రెండు- యాభై వేలు కట్నం. నే చేసుకునేది వీరి స్వంత కూతుర్నే అయితే, నే తీసుకునే డబ్బు కూడా వారు స్వంతంగా ఆర్జించిన డబ్బునే."

ఎవ్వరూ మాట్లాడలేదు.

సుబ్బరాజు భార్య, కూతురు పెళ్ళి కుదిరినందుకు గుళ్ళో అభిషేకం చేయించటానికి వెళ్ళింది.

కనకం ఆరోజే విడుదలైన తెలుగు సినిమా ఉదయం ఆటకు లైనులో నిల్చుంది.

సుబ్బరాజు, అతని ఆశ్రితులు మాట్లాడలేదు.

కాంతారావు అతని సహచరులు మాట్లాడేందుకు సాహసించ లేదు.

"లేదా చిన్న సవరణ చేస్తా. సుబ్బరాజుగారి మౌనాన్ని బట్టి, ఆయన కొచ్చే జీతంతో, ఆయన అనుభవించే జీవితం ఆయన స్వంతం కాదని తేలిపోయింది. అలాగే ఆయన సంపాయించిన డబ్బు కూడ ఆయన సొంతం కాదని నిర్ధారణ అయింది. సరే! ఆయన కూతురు కనకం. ఆయన కూతురేనన్న నమ్మకమేమిటి? 'నా కూతురు కాదు' అని ఆయన చెబితే సంబంధం చేసుకుంటాను."

"నా కూతురే!" సుబ్బరాజు అన్నాడు- లంఖణాలు చేసిన పిల్లిలా!

కాంతారావు నవ్వాడు. ఆ నవ్వు పిడిబాకులా సుబ్బరాజు గుండెల్లో దిగింది.

"అంటే డబ్బు మీరు న్యాయంగా సంపాదించింది కాదన్న మాటేగా?"

కాంతారావు వెళ్ళిపోయాడు.

కాంతారావు పరివారమూ వెళ్ళిపోయింది.

సుబ్బరాజు మాటపడిపోయింది. కాళ్ళూ, చేతులు పడిపోయాయి.

సుబ్బరాజు భార్య సోదర, సంసారబంధాలు త్రెంపుకొని, ఓ సన్యాసివెంట 'ఇహం మిధ్య-పరం సత్యం' అని వెళ్ళిపోయింది.

కనకం యాభై వేలు తీసుకుని, మొగుడి వేటలో పడ్డది.

సుబ్బరాజు ఆదాయం తగ్గగానే కూతుళ్ళు, అల్లుళ్ళు రాకపోకలు మానేశారు.

మిగిలింది సుబ్బరాజు- మాట్లాడేందుకు నోరు, తినేందుకు చేతులు లేని సుబ్బరాజు-అతనికీ, గున్న ఏనుక్కూ ఏమీ సంబంధం లేదిప్పుడు. ఎందుకంటే సుబ్బరాజు డబ్బువాతబడ్డ మనిషి. *